10న ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 10వ తేదీ ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ బి.బలరాం మీడియాకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెంటేవారితోట సుందరయ్య భవనంలో ట్రస్టు ఆధ్వర్యాన పెద్దవారికి ఉచిత గుండె మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ మెడికల్ క్యాంపుకు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ పాల్గొని రోగులకు ఇసిజి, 2డి ఎకో పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపును భీమవరం, చుట్టుపక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ క్యాంపు నిర్వహణకు సహాయ సహకారాలు అందిస్తున్న వసుధ ఫౌండేషన్, డెక్కన్ ఫైన్‌కెమికల్స్, ఎస్ఎల్‌జి ఆసుపత్రి, మానవత స్వచ్ఛంద సంస్థలకు, దాతలకు కృతజ్ఞతలు, అభినందలు తెలియజేశారు.

గురువుల గోడు..!

రెండు నెలల నుంచి ఉపాధ్యాయులకు అందని జీత భత్యాలు

ఉద్యోగోన్నతులు, బదిలీ అయిన ఉపాధ్యాయులకు తిప్పలు

పొజిషన్ ఐడిలు ఇవ్వకపోవడమే ప్రధాన కారణం

జీతాల కోసం 4 వేల మంది ఉపాధ్యాయుల ఎదురుచూపు

ఆందోళన బాటలో ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి - భీమవరం

రెండు నెలల నుంచి గురువులు వేతనాల కోసం గగ్గోలు పెడుతున్నా సర్కారు వినిపించుకోవడం లేదు. జీత భత్యాలు లేక గురువులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ ముగిసి రెండు నెలలు గడుస్తున్నా పొజిషన్ ఐడిలు రాకపోవడంతో జీతాల కోసం నిరీక్షిస్తున్నారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వం, విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పశ్చిమ జిల్లాలో సుమారు 14 వేల మంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బంది వివిధ కేడర్లలో పని చేస్తున్నారు. వారిలో సుమారు 3,500 మంది 4 వేల మందికిపైగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. అందులో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, మోడల్ ప్రయిమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సమానస్థాయి కేడర్ ఉపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్, సమానస్థాయి కేడర్ ఉపాధ్యాయులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు తదితర కేడర్లలో ఉన్నవారు బదిలీ అయినట్లు నివేదికలు చెబుతున్నాయి. కొత్తగా ఏర్పడిన మోడల్ ప్రయిమరీ స్కూల్స్ స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిలు బదిలీ అయ్యారు. మోడల్ ప్రయిమరీ పాఠశాలలు కొత్తగా ఏర్పడడంతో ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం పొజిషన్ ఐడిలు కేటాయించాల్సి ఉంది. అయితే బదిలీలు జరిగి రెండు నెలలవుతున్నా పొజిషన్ ఐడిలు కేటాయించ లేదు. దీంతో సుమారు 4 వేల మందికి పైగా రెండు నెలలు జీతాలు అందలేదు. ఇప్పటికే యుటిఎఫ్, ఎస్‌టియు సంఘాలు ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని పలుమార్లు ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో జిల్లా కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునివ్వడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు నిరసన తెలిపారు. పొజిషన్ ఐడిలిచ్చి జీతాలు చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఫ్యాప్టో నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సిఎఫ్ఎంఎస్‌లో వివరాలున్నా పొజిషన్ ఐడి సాకు

పాఠశాల మారిన గురువులకు, స్థాయి మారిన ఉపాధ్యాయులకు రెండు మాసాల నుంచి జీతాలు వేయకపోవడానికి

సాంకేతిక సమస్యలను విద్యాశాఖ అధికారులు ఎత్తి చూపుతున్నారు. గతంలో రెగ్యులర్ జీతాలు తీసుకుంటున్నా వీరి స్థానం మారడంతో ఏ పాఠశాలకు, ఏ స్థానానికి బదిలీ అయ్యారో దానికి సంబంధిత ఉద్యోగికి పొజిషన్ ఐడిని ప్రభుత్వం కేటాయిస్తుంది. సిఎఫ్ఎంఎస్‌లో వారి వివరాలను ప్రభుత్వం పొందుపరుస్తోంది. అప్పుడే వేతనాలు ఇవ్వడానికి అవకాశముంటుంది. పొజిషన్ ఐడి ఇవ్వడంలో ఆలస్యం కారణంగా రెండు నెలల జీతం బదిలీ అయిన ఉపాధ్యాయుల ఖాతాలకు ఇప్పటివరకూ జమ కాలేదు.

ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు

ఉపాధ్యాయులపై ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయా ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. యోగాంధ్ర, మెగా పేరెంట్స్ మీట్ వంటి కార్యక్రమాలకు ఎంతమంది హాజరయ్యారు. ఎన్ని ప్రాంతాల్లో సమావేశాలు జరిగాయి తదితర అంశాలను క్షణంలో ప్రభుత్వ పెద్దలు తెలుసుకున్నారు. మరి ఉపాధ్యాయుల సమాచారం తెలుసుకోవడానికి, వారికి ఐడిలు కేటాయించడానికి ఎంత సమయం పడుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెండు నెలలుగా ఐడిలు కేటాయించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులపాలవుతున్నామంటూ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులో చెక్కులు బౌన్స్ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ఖర్చులకు, పిల్లల ఫీజులు ఇతర చెల్లింపులకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం కావాలనే ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా జీతాలు ఇవ్వండి..

పెనుమత్స సాయివర్మ, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి

చాలా మంది ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడి లేదనే సాకుతో జీతాలు చెల్లించడం లేదు. దీంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పొజిషన్ ఐడిలు ఇస్తామని చెబుతున్నారు. రోజు రోజుకూ సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికే ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధ్యమైనంత తొందరగా ఉపాధ్యాయుల పెండింగ్ జీతాలు చెల్లించాలి.

ఐక్య సంఘాల పక్షాన ఆందోళనకు సమయత్తం

పి.ఎస్.విజయరామరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

బదిలీ అయిన ఉపాధ్యాయులు, ప్రమోషన్లు పొందిన గురువులు చాలా మంది జీతాలు పడక ఇబ్బందులు పడు తున్నారు. సాంకేతిక సమస్యల కారణంతో జీతాలు ఆపడం హాస్యాస్పదంగా ఉంది. ప్రభుత్వం తలచుకుంటే నిమిషాల్లో జరిగే పనిని సాకులు చూపి రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణం, తక్షణం ప్రభుత్వం స్పందించాలి. దీనిపై ఉపాధ్యాయ సంఘాల ఐక్య సమాఖ్య పక్షాన ఆందోళన చేయడానికి సమాయత్తమవుతున్నాం.

ట్రంప్ సుంకాలు ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - తణుకు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై వేసిన సుంకాలు వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో భారత్‌పై ట్రంప్ వేసిన సుంకాలు, అమెరికాలో భారతీయులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, పట్టణ కార్యదర్శి ఎ.అజయ కుమారి మాట్లాడుతూ ట్రంప్ భారత్‌పై దాడి చేస్తున్నా ప్రధాని మోడీ ఎందుకు నోరుమెదపడం లేదని విమర్శించారు. మన ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడానికి ట్రంప్ ప్రయత్నిస్తుంటే మోడీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. సుంకాల పెంపు వల్ల మన దేశ ప్రజలపై చాలా పెద్దత్తున భారాలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కూడా ఈ సుంకాలకు వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గార రంగారావు, కామన మునిస్వామి, గుబ్బల గోపి, ఎం.రమేష్, వివిఎన్.శివకుమార్, పి.రాజా, సిహెచ్.రమణ, సింగులూరి సత్యనారాయణ, బంగారమ్మ, సిహెచ్.రామకృష్ణ, ఎం.సువర్ణరాజు పాల్గొన్నారు.

తణుకులో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

నరసాపురం: ట్రంప్ భారత్‌పై అధిక సుంకాలు విధించడాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాద పెత్తందారీ విధానం ట్రంప్ రూపంలో మన దేశం వస్తువులపై అధిక సుంకాలను విధిస్తూ మన దేశ ఆర్థిక వ్యవస్థను నష్టపరుస్తోందన్నారు. ప్రధాని మోడీ మన సార్వభౌమాధికారాన్ని ఏ దేశానికీ తాకట్టు పెట్టకుండా స్వతంత్ర విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, బుడిద జోగేశ్వరరావు, కోడి లక్ష్మణ్, జి.ఆజాద్, పున్నాని అప్పలనాయుడు, పొన్నాడ మల్లేష్, వాసా రామలింగం పాల్గొన్నారు.

నరసాపురం అంబేద్కర్ సెంటర్లో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

తాగునీరివ్వండి మహాప్రభో

ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయం వద్ద మహిళల ధర్నా

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు నగర పంచాయతీ శివారు 14, 16వ వార్డులకు రెండు నెలలుగా తాగునీరు సక్రమంగా అందడం లేదని సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు తెలిపారు. నీటిని సక్రమంగా సరఫరా చేయాలని నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా వార్డు మహిళలు మాట్లాడారు. రెండు పూటలా నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరాలో అధికారుల పక్షపాత వైఖరి వీడాలన్నారు. కమిషనర్ వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించి తక్షణం పరిష్కరించాలని కోరారు. కార్యాలయం నుంచి బయటకొచ్చిన కమిషనర్ కృష్ణమోహన్ సమస్యను సత్వరం పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చానని త్వరలోనే జిల్లా అధికారులు, సాంకేతిక అధికారుల బృందం ఆయా వార్డుల్లో పర్యటిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ 14, 16వ వార్డులోని అన్ని వీధులకూ తాగునీరు సరఫరా అవ్వకపోవడంతో స్థానికులు అల్లాడిపోతున్నారని తెలిపారు. తెలిపారు. ఇటీవల స్థానిక జవహర్‌పేటలో ఉన్న రైల్వే గేట్ వద్ద వాల్ పద్ధతిని ప్రారంభించడం వల్ల ఈ సమస్య తీవ్రమైందని గుర్తు చేశారు. తాగునీరు లేక సతమతమవుతున్న ప్రజలు రోడ్లు ఎక్కుతుంటే వారిని బెదిరించడం కోసం అక్రమ కేసులు బనాయించడం కమిషనర్‌కు తగదన్నారు. కేసులు, అరెస్టులతో ప్రజలు బెదిరిపోరని తెలిపారు. తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం ఏరియా కమిటీ సభ్యులు బివి.వర్మ, డి.రవితేజ, ఎస్.ఉదయకుమారి, నాయకులు ఎస్.సూరిబాబు, గేదెల లావణ్య, ఎర్ర కృష్ణవేణి, జి.రాణి, జి.అచ్చుయమ్మ పాల్గొన్నారు.

కమిషనర్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, సిపిఎం నేతలు

పంచాయతీల ఆదాయానికి గండి..!

గ్రామ పరిధిలోని రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం నిలుపుదల

గతంలో ఏడాదికి నాలుగు దఫాలుగా పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ చెల్లింపు

ఏడాదిన్నరగా చిల్లిగవ్వ ఇవ్వని పరిస్థితి

ప్రభుత్వమే నిలిపివేసిందని చెబుతున్న రిజిస్ట్రేషన్ శాఖ

రూ.లక్షల్లో ఆదాయం కోల్పోయిన పంచాయతీలు

ఉద్యోగులకు జీతాలు సైతం ఇవ్వలేని స్థితికి మైనర్ పంచాయతీలు

మరోపక్క ఆర్థిక సంఘం నిధులను సైతం జమ చేయని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత వైసిపి ప్రభుత్వ తరహాలోనే కూటమి ప్రభుత్వం సైతం గ్రామ పంచాయతీలను తీవ్ర కష్టాల్లోకి నెట్టేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక తమ కష్టాలు తీరతాయని ఆశించిన పంచాయతీ పాలకులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నుంచి వచ్చినప్పటికీ పంచాయతీలకు జమ చేయకుండా కూటమి ప్రభుత్వం కోలుకోలేని

దెబ్బకొట్టింది. అంతటితో ఆగకుండా పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వచ్చే ఆదాయాన్ని సైతం నిలుపుదల చేయించి కోలుకోలేని స్థితికి నెట్టేసింది. ఏలూరు జిల్లాలో 27 మండలాల పరిధిలో 547 గ్రామ పంచాయతీలు, పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 409 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు సరిగ్గా ఇవ్వకుండా గ్రామాల్లోని అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం కలిగించింది. తాము అధికారంలోకి వస్తే పంచాయతీలను ఆదుకుంటామని కూటమి నేతలు గత ఎన్నికల్లో ఉపన్యాసాలు దంచేశారు. తీరా అధికారంలోకి వచ్చాక గత వైసిపి ప్రభుత్వం కంటే దారుణంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. గ్రామ పంచాయతీ పరిధిలో స్థలాలు, ఆస్తులకు సంబంధించి జరిగే రిజిస్ట్రేషన్ల నుంచి వచ్చే ఆదాయంలో రెండు శాతం నిధులు సదరు పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ ఇవ్వాల్సి ఉంది. 2024 మే నుంచి ఈ నిధులు నిలిచిపోయాయి. ప్రభుత్వమే పంచాయతీలకు నిధులు జమ చేయొద్దని చెప్పిందని రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు చెబుతున్నారు. పంచాయతీల పరిధిలో రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే సొమ్మును ఏడాదికి నాలుగు దఫాలుగా పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ జమ చేసేది. తక్కువగా లెక్కించినా మైనర్ పంచాయతీలకు సైతం రూ.రెండు లక్షలకు పైగా ఆదాయం వచ్చేది. మేజర్ పంచాయతీలకు రూ.పది లక్షలు వరకూ ఆదాయం వచ్చేదని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం నిలుపుదల చేయడంతో పంచాయతీల్లో నిధులు లేకుండాపోయాయి. ఇంటి, కుళాయి పన్నుల వసూలు డిసెంబర్ నుంచి మార్చి మధ్యలోనే సాగుతాయి. మిగిలిన కాలంలో పంచాయతీల్లో పని చేసే ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు, ఇతర పనులకు రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి వచ్చే ఆదాయాన్ని ఉపయోగించుకునేవారు. ఇప్పుడు ఆ ఆదాయం సైతం నిలిచిపోవడంతో పంచాయతీల్లో పనులు చేయడానికి నిధులు లేకుండాపోయాయి. దీంతో పంచాయతీ పాలకులు, అధికారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందినట్లని ఉపన్యాసాలు దంచే పాలకులు నిధులు ఇవ్వకుండా గ్రామాలను నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు తాను గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చెబుతున్నారు. మరి పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని అన్ని రకాలుగా నిలుపుదల చేస్తే గ్రామాలు ఏవిధంగా అభివృద్ధి చెందుతాయో ప్రభుత్వ పెద్దలే చెప్పాలి.

ఆర్థిక సంఘం నిధులివ్వని దుస్థితి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సైతం పంచాయతీల విషయంలో తీరు ఏమాత్రం మారలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేసి నెలలు గడిచిపోతుంది. ఇప్పటి వరకూ ఆ సొమ్మును పంచాయతీల ఖాతాల్లో జమ చేయలేదు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఆర్థిక సంఘం నిధులు రూ.140 కోట్లు వరకూ రావాల్సి ఉన్నట్లు అంచనా. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో పంచాయతీల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతోంది. వీధిలైట్లు, తాగునీరు, డ్రెయినేజీ వంటి సమస్యలు సైతం పరిష్కరించలేని పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తుందని కూటమి నేతలే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి వచ్చే ఆదాయం, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని అంతా కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలి

ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలని ప్రజా ఐక్య వేదిక నాయకులు శేషాపు అశ్రియ పిలుపునిచ్చారు. గొరగనమూడి సబ్‌స్టేషన్ వద్ద ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్రియ మాట్లాడుతూ ప్రజలపై ఎటువంటి భారాలు మోపబోమని అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం ఒక పక్క నిత్యావసర ధరలు పెంచడంతోపాటు, మరో పక్క పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు విపరీతంగా పెంచిందన్నారు. ఇవి చాలదన్నట్టు రకరకాల విద్యుత్ ఛార్జీలు పెంచి వేలకు వేలు బిల్లులు వసూలు చేస్తోందని విమర్శించారు. ప్రజలంతా ఐక్యంగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలిదిండి గోపాలరాజు, సత్యనారాయణ, పోతురాజు, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ప్రజా ఐక్య వేదిక నేతలు

పి-4 పేరిట ఉద్యోగులపై వేధింపులు తగవు

ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పి-4 పేరిట ఉద్యోగులపై వేధింపులు తగవని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ భవనంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లాలో పి-4పై కొంతమంది అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారని, మార్గదర్శకులుగా ఉండాలని ఉద్యోగులను వేధిస్తున్నారని తమ దృష్టికొచ్చిందని చెప్పారు. భీమవరం మున్సిపల్ కమిషనర్ 26 మందికి షోకాజ్ నోటీసులు ఇస్తే తమ సంఘం తరపున ముఖ్యమంత్రితో మాట్లాడి 24 గంటల్లో నోటీసులు ఉపసంహరించుకునేలా చేశామన్నారు. తాము పి-4 కార్యక్రమాన్ని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అయితే ఉద్యోగులు స్వచ్ఛందంగా వచ్చి చేయాలి తప్ప, బలవంతంగా ఒత్తిడి చేస్తే సహించేది లేదని తెలిపారు. సంఘం సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలవుతున్నా ఉద్యోగులపై దృష్టి పెట్టలేదన్నారు. ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిలు మాత్రమే అడుగుతున్నారు తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని తెలిపారు. రానున్న రోజుల్లో జరిగే పోరాటాలు, ఉద్యమాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. సంఘం రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ జనరల్ పి.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, వారికి రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ సెలవులు ఇవ్వాలని కోరారు. సంఘం అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.రాజేష్, ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్ పాల్గొన్నారు

మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

'మార్గదర్శి' నమోదుకు ఒత్తిడి చేయొద్దు

ఇన్‌ఛార్జి కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

పి-4లో భాగంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు 'మార్గదర్శి' నమోదుకు ఎటువంటి ఒత్తిడీ చేయకూడదని ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యక్తులను, కొత్తగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉత్సాహం కనబర్చే వ్యక్తులను ఒకే తాటిపైకి తీసుకొచ్చే కార్యక్రమమే పి-4 అని, అటువంటి వారినే మార్గదర్శిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. పి-4పై అవగాహన లేకుండా ప్రజలకు వక్రభాష్యం చెప్పే ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తెలిపారు. బంగారు కుటుంబాలను ఆదుకోవడంలో 'మార్గదర్శి' ఎంపిక పూర్తిగా స్వచ్ఛందంగానే జరుగుతోందని పేర్కొన్నారు.

రైతుల జీవితాల్లో వెలుగు రేఖ స్వామినాథన్

రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన స్వామినాథన్ ఘనంగా శత జయంతి సభలు

ప్రజాశక్తి - పెంటపాడు

భారతదేశ ప్రజలందరూ తినే ఆహారంపై డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ పేరు ఉంటుందని సిఐటియు జిల్లా నాయకులు చింతకాయల బాబురావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సభ పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో బాబురావు, సత్యనారాయణ మాట్లాడుతూ ఈ దేశ ఆహార ధాన్యాల మిగులు ఉత్పత్తిని సృష్టించిన ఘనత స్వామినాథన్‌కు దక్కుతుందన్నారు. ముందుగా స్వామినాథన్ చిత్రపటానికి వారు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డీ సత్యనారాయణ, గాది సుబ్బయ్య, జక్కంపూడి బంగారయ్య, వీరబత్తుల దానయ్య, కొవ్వూరి గానీరెడ్డి, ఆకుమూరి శ్రీను, కొయ్యాల శ్రీను, మాదాసు శ్రీను, లింగంపల్లి రవితేజ పాల్గొన్నారు.

ఆచంట : ఎంఎస్.స్వామినాథన్ దేశ వ్యవసాయ రంగంలో తీసుకువచ్చిన మార్పులతో రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ శతజయంతి సభ ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఆచంటలోని ది మృత్యుంజయ సొసైటీ కార్యాలయ ఆవరణలో రైతుసంఘం నాయకులు నెక్కంటి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ముందుగా స్వామినాథన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు, రైతులు పి.మోహన్, కుసుమే జయరాజు, కొండేటి సత్యనారాయణ, బండి రంగారావు, గుత్తుల రంగారావు, ఎం.రామలింగేశ్వర, కె.పెద్దిరాజు, కె.బాలకృష్ణ, ఎం.రామకృష్ణ, బి.దుర్గా, ఎం.పెద్దింట్లు, ఎం.శ్రీనివాసు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్ శతజయంతి కార్యక్రమం గురువారం ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యాన ఇటుకలగుంట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు పాలుపూరి సత్యనారాయణ, కండెల్లి సోమరాజు స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పాలకూరి సత్యవతి, బంకూరు యశోదా, పాలుపూరి శ్రీనివాసు, బంకూరు సత్యనారాయణ, పాల్ పూరి ధనలక్ష్మి, పాల్పూరు వెంకట నాగమణి పాల్గొన్నారు.

గణపవరం : వ్యవసాయ రంగంలో పలు మార్పులు తీసుకొచ్చి రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ అని కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెచ్చెట్టి నరశింహమూర్తి అన్నారు. స్వామినాథన్ శత జయంతి సందర్భంగా గురువారం కేశవరంలో రైతు, కౌలురైతు, వ్యవసాయకార్మిక సంఘాల ఆధ్వర్యాన జయంతి సభ నిర్వహించారు. స్వామినాథన్ హరిత విప్లవంతో నూతన వరి వంగడాలతో ప్రపంచ దేశాల్లో ఆహార కొరత తీర్చిన మహనీయుడని కొని యాడారు. కార్యక్రమంలో చింతపల్లి దుర్గాప్రసాద్, వీరవల్లి శ్రీనివాస్, కోడి సత్యనారాయణ, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురం: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్ శతజయంతి కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన యర్రంశెట్టివారి పాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ వ్యవసాయ రంగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వ్యవసాయ రంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గుబ్బల నాగేశ్వరరావు, బొక్క శ్రీనివాసరావు, కుక్కల శ్రీరామ్మూర్తి, పితాని మురళీ పాల్గొన్నారు.

పెంటపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు

చేపలు మృత్యువాత..!

మృత్యువాత పడిన చేపలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని దొడ్డనపూడి గ్రామ రెవెన్యూ పరిధిలో గల చేపల చెరువులో వందల సంఖ్యలో చేపలు గురువారం మృతిచెందాయి. దీంతో ఆ చెరువును లీజు తీసుకుని, చేపలు పెంచుతున్న కాళ్ల గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ లబోదిబోమంటున్నారు. చేపలు తేలిపోవడంతో చేపలను గట్టుపై పూడ్చి వేస్తున్నారు.

100 టన్నుల చేపలు చనిపోయాయి

పి.సత్యనారాయణ, ఆక్వా రైతు, కాళ్ల

దొడ్డనపూడి గ్రామంలో 75 ఎకరాల చేపల చెరువులు సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుతం కేజీ చేప ధర రూ.118 ఉంది. కేజీన్నర, రెండు కేజీల చేపలు ఆకస్మాత్తుగా చేపల చెరువులో సుమారు 100 టన్నుల చేపలు చనిపోయాయి. వాటి విలువ రూ.కోటి 50 లక్షలు ఉంటాయి. వాతావరణం తేడా అనుకుంటే చుట్టుపక్కల చెరువులు బాగానే ఉన్నాయి. విషయం ఏమిటో అర్థం కావడం లేదు. మత్స్యశాఖ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

చేపలకు వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

ఎం.ఇందిర ప్రియదర్శిని, మత్స్యశాఖ అధికారిణి, కాళ్ల

చెరువులోని నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గడం, పిహెచ్ స్థాయి మారడం వల్ల చేపల మరణానికి దారితీస్తాయి. ముఖ్యంగా ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్నప్పుడు నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతుంది. దీనివల్ల చేపలు ఊపిరాడక చనిపోతాయి. కొన్ని రకాల వ్యాధులు చేపలకు సోకినప్పుడు అవి మరణిస్తాయి.

పూలు, పండ్ల ధరలకు రెక్కలు!

వరలక్ష్మీ వ్రతం వేళ వినియోగదారుల బెంబేలు

పాలకొల్లు : రద్దీగా ఉన్న పూల దుకాణాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వరలక్ష్మి వ్రతం సందర్భంగా పూలు, పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. లక్ష్మీ దేవికి ఇష్టమైన చామంతి పూలకు ప్రతి సంవత్సరం వలె ఈ ఏడాది డిమాండ్ పెరిగింది. ఇప్పటి వరకు కిలో రూ.200 ఉన్న చామంతి పూలు రూ.600-800 మధ్యకు పెరిగాయి. కనకాంబరాల ధర కూడా సామాన్యులకు అందని ధర పెరిగింది. కిలో రూ.600 ఉన్న వీటి ధర రూ.1200-1500కు పెరిగింది. మూర రూ.50 అమ్ముతున్నారు. గత 10 రోజులుగా తీవ్ర ఎండల ప్రభావంతో ఉభయ గోదావరి జిల్లాల్లో ఉత్పత్తి తగ్గింది. దీంతో బెంగుళూరు మీద అందరూ ఆధారపడుతున్నారు. చామంతి పూలు కూడా రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. సామాన్యులు పండ్లు కొనుగోలు చేసే పరిస్థితిలో లేరు. యాపిల్, బత్తాయి, అరటి పళ్ల ధరలు రెట్టింపుకు పైగా అమ్ముతున్నారు. రూ.500 కాగితం పూలు, పండ్లకు సరిపోవడం లేదని కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు.

అపురూపమైన బంగారు రూపు..

పెనుమంట్ర : ప్రస్తుతం అతివేగంగా పెరుగుతున్న బంగారం ధరల వల్ల వరలక్ష్మీ వ్రతంలో విధిగా వినియోగించే బంగారం రూపు అపురూపం అయిపోయిందని వినియోగదారులు, ముఖ్యంగా మహిళలు బెంబేలు ఎత్తుతున్నారు. మార్కెట్లో గురువారం 916 బంగారం 22కె 10 గ్రాముల ధర రూ.93,500, 8 గ్రాముల ధర రూ.74 వేలు పలుకుతోంది. ఈ నేపథ్యంలో చిన్న రూపు ధర రూ.2,200 నుంచి 2 వేల వరకు బంగారం వర్తకులు అమ్ముతున్నారు. ఇహ వ్రతానికి అవసరమైన పువ్వులు, అరటి పండ్లు, కొబ్బరికాయలు, బొండాలు, తమలపాకుల ధరలు సైతం ఆకాశాన్ని తాకి ఉండడం విశేషం.

పెనుమంట్ర : రూపులు

కొనసాగిన తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - గణపవరం

తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం ఐసిడిఎస్ గణపవరం సెక్టార్ ఆధ్వర్యాన అంగన్వాడీలు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక పిహెచ్సి డాక్టర్ కె.ఓంకార్ నాద్, అంగన్వాడీ సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. బిడ్డకు ఆరునెల వరకు తల్లిపాలు ఇవ్వవచ్చునని, దీనివల్ల బిడ్డకు రోగాలు దరిచేరవని, ఆరోగ్యంగా ఉటుందని చెప్పారు. బాలింతలు, గర్భిణులు, అంగన్వాడీలు అందిస్తున్న పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణపవరం వైద్యసిబ్బంది, అంగన్వాడీలు, జనసేన మండలాధ్యక్షులు తోట శ్రీను పాల్గొన్నారు.

పెనుమంట్ర : తల్లిపాలు మాత్రమే బిడ్డలకు తొలి రోగ నిరోధక టీకా అని, తమ బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ ఎ.కృష్ణ కుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా పెనుమంట్ర ప్రాజెక్టు కార్యాలయంలో గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించి, 20 మంది గర్భవతులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సిహెచ్.మంగ, పంచాయతీ వార్డ్ సభ్యులు సన్నమండ శంకర్, దుర్గ, అనూరాధ, నీటి సంఘం చైర్మన్ బులి రామిరెడ్డి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు పిహెచ్సి పరిధిలో ఐసిడిఎస్, వైద్య సిబ్బందితో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.నవ్య జీవన్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు మొదటి టీకాగా ఉపయోగపడతాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఒ సి.శిరీష, గ్రామ పెద్దలు సత్యనారాయణ రాజు, నక్కంటి ఆదినారాయణ పాల్గొన్నారు.

చౌక డిపోల తనిఖీ

ఉండి: తెల్లరేషన్ కార్డుదారులకు సకాలంలో చౌక డిపోల ద్వారా సరుకులు సరఫరా చేయాలని మండల పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ కూనపరాజు సూర్యనారాయణ రాజు అన్నారు. గురువారం ఉండిమండలంలోని చెరుకువాడ, కలిసిపూడి గ్రామాలలోని చౌక డిపోలు తనిఖీ చేసిన సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ 65 సంవత్సరాల నిండిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందించాలని డీలర్లకు సూచించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లో అవకతవకలు లేకుండా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ తనిఖీలో చెరుకువాడ గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.గొల్ల, సిబ్బంది ఉన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి

సిఐటియు ఉపాధ్యక్షులు వాసుదేవరావు

భీమవరం : సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఐక్యతతో పోరాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపై మరిన్ని విస్తృత పోరాటాలు చేయాలని ఆ సంఘం నిర్ణయం చేశారు. మండల కేంద్రమైన పాలకోడేరులో బుధవారం సాయంత్రం నిర్వహించిన సిఐటియు మండల మహాసభలో వాసుదేవరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకొచ్చి వేతనాలు పెంచకుండా పదేళ్లుగా కార్మికులను మోసం చేస్తుందన్నారు. పెరిగిన ధరలతో ఒక పక్క ఇబ్బంది పడుతుంటే మరో పక్క పన్నులతో, కరెంటు బిల్లుల భారాలు వేస్తుందన్నారు. సిఐటియు జిల్లా నాయకులు డి.కళ్యాణి మాట్లాడుతూ కార్మిక చట్టాలలో చాలావరకు కార్మిక వర్గానికి అనుకూలంగా కావడం లేదన్నారు. రానున్న కాలంలో కార్మికులందరినీ ఐక్యం చేయడానికి తగిన విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం సిఐటియు నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్గా ఎస్.లారెన్స్ కుమార్, కో కన్వీనర్ గోపాలకృష్ణంరాజు ఎన్నికయ్యారు. నాయకులు ఆశ్రయ, విమల, మరియమ్మ, శాలిని, అప్పలరాజు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

11న పెనుగొండ ఎఎంసి ఛైర్మన్ ప్రమాణస్వీకారం

పెనుమంట్ర : పెనుగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ(మార్కెట్ యార్డ్) నూతన ఛైర్మన్ బజిటి ప్రాణేశ్ ప్రమాణ స్వీకార సభ ఈనెల 11వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు జరుగుతుందని స్థానిక టిడిపి మండల కమిటీ అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి గురువారం ఇక్కడ తెలిపారు. పెనుగొండ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో పలువురు ప్రస్తుత మంత్రులు, జిల్లాలోని శాసనసభ్యులు, కూటమి నాయకులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నేషనల్ డి వార్మింగ్ డేను జయప్రదం చేయాలి

గణపవరం : నేషనల్ డి వార్మింగ్ డేను జయప్రదం చేయాలని గురువారం స్థానిక మండల పరిషత్ భవనంలో జరిగిన మండల టాస్క్‌ఫోర్సు సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో పాల్గొన్న గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబీశ్రీలక్ష్మి, తహశీల్దార్ అప్పారావు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు మందులు ఇస్తారని చెప్పారు. మందు బిళ్లలు విద్యార్థులతో నమిలి మింగించవలసిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం, పిప్పర డాక్టర్లు పి.కిరణ్మయి, కె.ఓంకార్ నాద్, శ్రీదివ్య, గణపవరం సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, ఎంఇఒ జి.బాలయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలిఅడుగు'

మొగల్తూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మండలంలోని వార్త గ్రామంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యాన సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాల రాంబాబు, తిరుమని రామారావు, దొంగ పెద్దబ్బులు, తిరుమని సత్యనారాయణ, నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, కడలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం: ప్రజలకు మంచి పాలన అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మత్స్యకార అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. గురువారం పట్టణంలోని 6వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధిని వివరించారు.

రేపు ఎపి నిట్ స్నాతకోత్సవం

తాడేపల్లిగూడెం : నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్(ఎపి నిట్) 7వ స్నాతకోత్సవం ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎపి నిట్ యాజమాన్యం గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విద్యాసంస్థను 2015లో ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సును ఏడు బ్యాచ్‌ల విద్యార్థులు పూర్తి చేసుకున్నారన్నారు. ప్రస్తుతం 2021-25 బ్యాచ్ కు చెందిన 667(బాలురు 506, బాలికలు 161) మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం చేయనున్నారు. వీరితోపాటు పిహెచ్‌డి పూర్తిచేసిన 29 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను అందజేయనున్నారు. సంస్థలో మొత్తం 8 కోర్సులను నిర్వహిస్తుండగా ఆయా కోర్సుల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన ఒక్కొక్క విద్యార్థి చొప్పున మొత్తం 8 మంది విద్యార్థులకు, బ్యాచ్ వారీగా అద్భుత ప్రతిభ కనబరిచిన ఓ విద్యార్థికి ఇన్స్టిట్యూట్ తరుపున బంగారు పతకాన్ని ప్రధానం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి టెక్నాలజీ, సాఫ్ట్ వేర్ అండ్ సర్వీసెస్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న హాజరుకానున్నారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఇన్స్టిట్యూట్ ప్రోగ్రస్ రిపోర్టును అందజేయనున్నారని నిట్ అకడమిక్ డీన్ డాక్టర్ ఎన్.జయరామ్ పేర్కొన్నారు.

ఫోన్లు వెనక్కి తీసుకోండి : సిడిపిఒ

పెనుమంట్ర : పెనుమంట్ర ప్రాజెక్ట్ పరిధిలోని మూడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వ వైఖరికి నిరసనగా తమ డిమాండ్స్ సాధన లో భాగంగా వదిలి వెళ్లిన స్మార్ట్ ఫోన్స్ వెనక్కి తీసుకోమని సిడిపిఒ ఎ.కృష్ణ కుమారి కోరగా వారు ససేమిరా అన్నారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. అంగన్వాడీ ప్రాజెక్ట అధ్యక్షురాలు కానూరు తులసి, కార్యదర్శి విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు సాయి మహాలక్ష్మి, టీచర్స్ మంగతాయారు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం

తాడేపల్లిగూడెం : మండలంలోని నవాబుపాలెం గ్రామంలో గురువారం బదిలీపై వేరే గ్రామాలకు వెళ్లిన, నవాబుపాలెం గ్రామానికి వచ్చిన సచివాలయం ఉద్యోగులకు సర్పంచి మద్దూకూరి గంగ భవాని అధ్యక్షతన స్వాగతం, వీడ్కోలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇప్పటి వరకు ఈ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన మహమ్మద్ అహ్మద్, ద్వారంపూడి చంద్రశేఖర్, కేదారి రెడ్డి, కోలా వినయ్ కుమార్, మద్దాల వరలక్ష్మి, మల్లుల లక్ష్మి, రాయవరపు స్నేహ సౌగంధిక, నీలపాల వెంకటేశ్వరరావు, నవాబుపాలెం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహించి, ఇటీవల జరిగిన బదిలీపై వేర్వేరు గ్రామ సచివాలయాలకు వెళ్లిన సందర్భంగా వారిని సన్మానించి వీడ్కోలు తెలియజేశారు. మద్దూకూరి ధనరాజు, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, పంచాయతీ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

ఆకివీడు : ఇద్దరు మోటార్ సైకిల్ దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి తొమ్మిది మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సిఐ జగదీశ్వర్ రావు తెలిపారు. గురువారం సిఐ జగదీశ్వరరావు విలేకరులకు వివరాలు తెలియజేశారు. కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం ఎండవల్లి గ్రామానికి చెందిన కొనసాని నాగాంజనేయులు, మండలంలోని చినకాపవరం గ్రామానికి చెందిన కొప్పుల రమేష్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు పంపించినట్లు ఆయన తెలిపారు. ఇటీవల తరచూ మోటార్ సైకిల్ దొంగతనం పెరిగిపోతూ ఉండడంతో ఎస్‌పి ఆదేశాల మేరకు తన పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఒకటి ఆకివీడు ఎస్ఐ హెచ్.నాగరాజు, ఉండి ఎస్ఐ ఎండి నసీరుల్లా బృందాలుగా ఏర్పడి ఈ దొంగతనాలను చేధించారని తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పేలుడు పదార్థాల వల్లే నా కొడుకు గాయపడ్డాడు

ఓ తండ్రి ఆవేదన

పెనుమంట్ర : పొలమూరు గ్రామంలో అక్రమ నాటు తుపాకులు, పేలుడు పదార్థాలు పోలీసులకు దొరికిన సంగతి తెలిసిందే. అయితే పేలుడు పదార్థమని తెలీక తన కుమారుడు ముట్టుకోవడం వల్ల చేతి వేళ్లు పోయాయని తండ్రి రెల్లి శ్రీనివాస్ వాపోయాడు. ఆయన కథనం మేరకు గడచిన మే నెల వేసవి సెలవుల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న తన కుమారుడు రెల్లి శివ గణేష్ బ్రాహ్మణ చెరువు రహదారి పక్కన పడి ఉన్న డబ్బాను తీసుకొని చేతితో ఊపాడని, అలా చేసిన వెంటనే ఒక్కసారిగా పేలుడు వ్యాపించి కుడిచేయి వేళ్లు కట్ అయిపోయాయని అన్నారు. ఈ ప్రాంతంలో పేలుడు ఏమిటని ఆరా తీసాం కానీ మాకు అంతు చిక్కలేదని, పొలమూరు శివారులో ఆక్వా చెరువులపై పేలుడు పదార్థాలు ఉపయోగిస్తున్నారని ఆ నోట ఈ నోట వ్యాపించినా అసలు విషయం నిర్ధారించలేకపోయామని అన్నారు. శనివారం రాత్రి పోలీసుల తనిఖీ సంఘటనతో అప్పుడు జరిగిన ప్రమాదానికి సంభవించిన పేలుడు పదార్థాలు ఆక్వా రైతులకు సంబంధించినవేనని తెలుస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పిల్లలకు ఈ సంఘటన పట్ల పెద్దలు తస్మాత్ జాగ్రత్త చెప్పి, రోడ్డు పక్కన, కాల్వ గట్లు, రొయ్యల చెరువుల ప్రాంతాల్లో ఎటువంటి పేలుడు పదార్థాలు ఉన్నప్పటికీ వాటిని ముట్టుకోకూడదని, తమ అబ్బాయికి జరిగిన ఇబ్బంది ఏ తల్లిదండ్రులకు కలగకూడదని ఆయన విన్నవించారు.

క్రీడా పోటీలు విజయవంతం చేయాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ఎంపికకు నేటి నుంచి మూడు రోజుల పాటు తణుకులో నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీలలో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యాన ఈనెల 29న హాకి లెజెండ్ మేజర్ ధ్యాంచంద్ పుట్టినరోజును పురస్కరించుకొని రాష్ట్రం మొత్తం 10 క్రీడాంశాలలో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. వీటిలో అథ్లెటిక్స్, ఆర్చరీ, బాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, హాకి, కబడ్డి, ఖో-ఖో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ ఉంటాయన్నారు. తణుకు ఎస్‌సిఐఎం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో అథ్లెటిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ పోటీలు, 9వ తేదీన జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో ఆర్చెరి, బాక్సింగ్, బాస్కెట్ బాల్, కబాడీ, ఖోఖో పోటీలు, 10వ తేదీన ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కబాడీ, కోకో, వాలీబాల్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌తో హోటల్ పోటీలలో పాల్గొనవచ్చు అని, ఏదైనా అవసరమైన సమాచారానికి సెల్ నెం 85000 64372 సంప్రదించాలన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినతి

యలమంచిలి : మండలంలోని చించినాడ, అరుంధతి పేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం సంఘస్తుల ఆధ్వర్యాన విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘ పెద్దలు తెన్నేటి స్టాలిన్, మొమ్మిడివరపు ఆంజనేయులు, శెట్టిమి భాస్కరరావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా లో వోల్టేజీ సమస్యతో రాత్రి సమయంలో ఇళ్లల్లో ఫ్యాన్లు తిరగకపోవడంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, ఈ సమస్యపై ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘస్తులు వెంకట స్వామి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు : ఎంపిపి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలో ఉన్న ఆక్వా రైతులపై చిన్నా, పెద్దా అని పక్షపాతం చూపించవద్దని ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు(నర్సింబాబు) విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముందుగా అధికారులతో మండలంలో ఉన్న సమస్యలపై వివరణ కోరారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో ఆక్వా చెరువులు ఎక్కువగా ఉన్నాయని, అయితే ఈ చెరువుల తవ్వకాల్లో మత్స్యశాక అధికారులు, రెవెన్యూ అధికారులు రైతుల పట్ల చిన్న, పెద్ద తారతమ్యం చూపిస్తూ చిన్న రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని దీనిపై తహశీల్దార్ దృష్టి సారించకపోతే దానికి తహశీల్దార్‌పై రైతులకు చెడు అభిప్రాయం కలుగుతుందని అక్కడ ఉన్న తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. పెద్దఎత్తున చెరువు అవకతవకలు జరుగుతున్నప్పుడు అధికారులు బడా రైతులకు పూర్తి సహకారం అందిస్తున్నారని, అదే చిన్న రైతు ఎవరైనా తన చెరువును కనీసం మరమ్మతులు చేపడుతుంటే దానికి అనుమతులు లేవంటూ, మీరు వెళ్లి తహశీల్దార్‌ని కలవండి అని చెప్పి పనులు ఆపేయటంపై అర్థమేంటని ఆయన ప్రశ్నించారు. చిన్న రైతులను ఇబ్బంది పెడితే తాము ప్రత్యక్షంగా పేద రైతుల పక్షాన నిలబడి పోరాడతామని, ఇప్పటికైనా మత్స్యశాఖ, రెవెన్యూ అధికారుల తీరు మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, తహశీల్దార్ రావి రాంబాబు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రమేష్ నాయుడు, ఎంఇఒ బొక్క వినాయకరావు, గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లోనే పన్నుల చెల్లింపు

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాంప్రసాద్

ప్రజాశక్తి - పాలకోడేరు

రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ

ప్రజలకు పారదర్శకంగా పాలన అందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రభుత్వం స్వర్ణ పంచాయితీ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, దీని ద్వారానే అన్ని పనులు చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నామని పాలకోడేరు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాంప్రసాద్ అన్నారు. పెన్నాడ అగ్రహారం సచివాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన పలు పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, పన్నుల వసూలు, సచివాలయ ఉద్యోగుల పనితీరుపై సమీక్షించి మాట్లాడారు. పన్నుల వసూళ్లలో కొన్ని అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్వర్ణ పంచాయితీ పోర్టల్లను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రతి ఇంటికి సంబంధించిన కొలతలు, పన్ను డిమాండ్‌ను ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. పన్నులు చెల్లించేవారు నేరుగా పోర్టల్ ద్వారా చెల్లించుకునే వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. ఈయన వెంట పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజు ఉన్నారు.

విజయవంతంగా విద్యార్థి సంఘం ఎన్నికలు

ప్రిన్సిపల్ బిహెచ్.హిమబిందు

ఎన్నికైన విద్యార్థులు

తణుకు : ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థి సంఘం ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ బిహెచ్.హిమబిందు తెలియజేశారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందడం, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం ద్వారా ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల నియమాలు, పారదర్శకత గురించి ప్రత్యక్షంగా తెలుసుకుంటారని అన్నారు. గెలుపొందిన విద్యార్థులు కళాశాలలో జరిగే కార్యక్రమాలను నిర్వహించడంలో పాల్గొని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలియజేశారు. ఈ ఎన్నికలు విద్యార్థులు 3 ప్యానెల్స్‌గా పోటీ చేయడం జరిగిందన్నారు. ఇందులో ఒకటవ ప్యానెల్ గెలుపొందడం జరిగిందన్నారు. వీరిలో ఛైర్‌పర్సన్‌గా డి.తేజ, సెక్రటరీగా జి.రోజితసాయి, వైస్ ఛైర్‌పర్సన్‌గా టి.పార్వతి నాగదుర్గ, జాయింట్ సెక్రటరీగా పి.రేణుక, కల్చరల్ సెక్రటరీగా ఎన్.ధనశ్రీ, జనరల్ కెప్టెన్‌గా జి.కీర్తన గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా చేనేత దినోత్సవం

తణుకు : చేనేత వస్త్రాలను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు సైతం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తోందని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా చేనేత వస్త్రాలకు గుర్తింపు తీసుకువచ్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తణుకు ఎఎంసి ఛైర్మన్ కొండేటి శివ, చేనేత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వావిలాల సరళాదేవి, తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్ పాల్గొన్నారు.

గణపవరం : జాతీయ చేనేత దినోత్సవం గణపవరం డిగ్రీ కాలేజీలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ చేనేత వస్త్రాల తయారీ, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవితాలు గురించి విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ప్రభుత్వం వారికి ఇచ్చే రాయితీలు, చేనేత మగ్గాలు ఏప్రాంతాల్లో ఉన్నాయి అనే అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బండారు ప్రసాద్ మూర్తి రాసిన తాతకో నూలుపోగు అనే కవితను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూప రాణి, జి.వెంకటరమణ, షేక్ మోయిన్ అన్సారి, షేక్ పర్విన్, కెవి.గణేష్ కుమార్, జివి.శారదాదేవి, పి.భాస్కరరావు, పివి.రమేష్ పాల్గొన్నారు.

కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేత

పెనుమంట్ర : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం పలు ప్రాంతాల్లో ఉన్న చేనేత కళాకారులకు ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం తరుపున ప్రశంసా పత్రాలు సంఘ ప్రతినిధులు, తాను అందజేసినట్టు మార్టేరులోని రాష్ట్ర చేనేత విభాగాల రాష్ట్ర రాజకీయ అధికార ప్రతినిధి అల్లాడ సూర్య భాస్కర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆచంట నియోజకవర్గంలోని ఆచంట వేమవరం గ్రామంలో చేనేతల్ని కలుసుకొని వాళ్ల కళా నైపుణ్యాన్ని గుర్తించి, ప్రశంసా పత్రాలు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు రుద్రాక్షల వీరలక్ష్మి, ముప్పన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నరసాపురం: చేనేత వస్తువులు ఆకర్షణీయంగా, నాణ్యతగా ఉంటే మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. గురువారం మండలంలోని ఐఎల్‌డిసిలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ చేనేత కార్మికుల జీవన పరిస్థితుల్ని మెరుగుపర్చేందుకు ఐఎల్‌డిసి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. రానున్న పుష్కరాల్లో లేసుతో పాటు చేనేత వస్తువుల్ని కూడా ఉత్పత్తి చేసేలా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. అనంతరం చేనేతదారుల్ని ఘనంగా సత్కరించారు. అడగళ్ల బాబా, అలంక నాగేశ్వరరావు, మావూరి ఆనంద్ పాల్గొన్నారు.

సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలివ్వాలి

సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు

తణుకు : రాష్ట్రంలో సహకార సంఘాలకు చెల్లించవలసిన రూ.156 కోట్ల బకాయిలు తక్షణం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యాన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక సాలిపేటలో సంఘ పతాకాన్ని చేనేత సహకార సంఘం పూర్వ మేనేజర్(రిటైర్డ్) కరేళ్ల నాగేశ్వరరావు ఎగరవేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నేతన్న నేస్తం పథకాన్ని మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికునికి కొనసాగిస్తామని, చేనేత సహకార సంఘాలకు 2017 నుంచి పావలా వడ్డీలు యారన్ సబ్సిడీ రిబేట్ కింద చెల్లించవలసిన రూ.156 కోట్లు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారని వీరభద్రరావు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలలు సమయం అవుతున్నా నేటికీ అమలు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని వీరభద్రరావు విమర్శించారు. ప్రభుత్వం స్పందించి చేనేత కార్మికులకు వచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, రుద్రాక్షల శ్రీనివాసు, తాడిశెట్టి వెంకటేశ్వరరావు, అందే శ్రీనివాసు, తిప్పా శివ, తాడిశెట్టి సూర్యారావు, వాసా త్రిమూర్తులు పాల్గొన్నారు.

వేల్పూరులో జెండా ఆవిష్కరిస్తున్న వీరభద్రరావు

నరసాపురం పట్టణంలోని వీవర్స్ కమ్యూనిటీ భవనాలను ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. స్థానిక 18వ వార్డులో వనువులమ్మ ఆలయం వద్ద జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో గురువారం పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సంఘ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్, వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ కార్యదర్శి ఒగ్గు సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక వీవర్స్ కమ్యూనిటీ హాల్లో చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకంను నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కళాకారులు తయారుచేసిన ఎన్నో కళారూపాలు నేటికీ విదేశాల్లో డిమాండ్ ఉందని చెప్పారు. కార్యదర్శి నీలం శెట్టి సత్యప్రసాద్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, శాగా రాంబాబు పాల్గొన్నారు.

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు

ఆర్.ఓ.సి.నెం.481/2025/ఇ1 **ది.07-08-2025**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని వివిధ వార్డులలో గ్రాంటుతో-2 పనులు మరియు పురపాలక సంఘ సాధారణ నిధులతో-2 పనులు చేపట్టుటకు గాను అంచనాలు విలువ సుమారు **రూ.36,24,000/-** లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది.11-08-2025వ తేది సాయంత్రం గం.04.00 ని॥ల నుండి లభించును.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది : 11-08-2025 సాయంత్రం గం.04.00 ని॥లకు

బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేది : 18-08-2025 సాయంత్రం గం.4.00 ని॥లకు

ప్రైస్ బిడ్ తెరుచు తేది : 18-08-2025 సాయంత్రం గం.04.30 ని॥లకు

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘం.

పేరు మార్పు

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, ఎల్.అగ్రహారం గ్రామం, L&T కాలనీకి చెందిన దేవరావ్ గైక్వాడ్ గారి కుమారుడైన గైక్వాడ్ సంజయ్ దేవరావ్ అను నేను నెం.M3758829 రు గల పాస్‌పోర్టులో GAIKAWAD SANJAY DEVARAO అని తప్పుగా పడినది. నెం.351015895269 రు గల ఆధార్ కార్డులో నా అసలు పేరు GAIKAWAD SANJAY DEVARAV అని యున్నదిని తెలియజేయడమైనది.

GAIKAWAD SANJAY DEVARAV

IN THE COURT OF THE 1st ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) : TANUKU

O.S.508/2024

Between:
Nagavarapu Ramalingeswara Rao ...Plaintiff
And
Kadali Saraswathi & Others ...Defendants

వాది తరపున వేయించిన ప్రకటన

2.Kadali Lakshmi Susmitha, D/o.Late Prabhakara Rao, Flat No.502, 5th Floor, Vasanth Vihar, Opposite to Gurajada Convent, Tanuku, TJCJC.

యిందుమూలముగా 2వ వాదికి తెలియజేయునది ఏమనగా, పైనెంబరు దావాలో కోర్టు ద్వారా మీకు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు నోటీసులు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున ఈ పేపరు ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోపు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరు అయ్యి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షములో దావాను విచారించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

తణుకు **గుడిమెట్ల వీరెడ్డి**
తేది.07.08.2025 వాది తరపు అడ్వకేటు

నోటీసు

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.No.26/2022

Between:-
1. పదాల అమ్మాజి ...అప్పిలెంటు
మరియు
1. శ్రీమతి పదాల అనే అడబాల గీత & 7గురు ...రెస్పాండెంట్లు

టు:
రెస్పాండెంట్లు 1టు5

1. శ్రీమతి పదాల అనే అడబాల గీత, భర్త: సూర్యచంద్రరావు, డోర్ నెం. 7-1-72/2, చర్చి వీధి, రోటరీ క్లబ్ ఎదురుగా, ఆర్.డి.ఓ. ఆఫీసు వద్ద, జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.
2. పదాల సత్యనారాయణ, తండ్రి: రామన్న, ఫ్లాట్ నెం. 42, ఫస్ట్ ఫ్లోర్, ఆర్.వి. ఉద్యాన్, ఎన్.హెచ్.ఆర్ కాలేజీ వద్ద, చందానగర్, హైదరాబాద్.
3. పదాల పాపాయమ్మ, భర్త సత్యనారాయణ, ఫ్లాట్ నెం. 42, ఫస్ట్ ఫ్లోర్, ఆర్.వి. ఉద్యాన్, ఎన్.హెచ్.ఆర్ కాలేజీ వద్ద, చందానగర్, హైదరాబాద్.
4. తాడి అనే పదాల అరుణకుమారి, భర్త రవికుమార్, ఫ్లాట్ నెం.505, గ్రీన్ టవర్స్, హుడా ట్రేడ్ సెంటర్, ఫ్లాట్ నెం. బి/సి, శేరిలింగంపల్లి, హైదరాబాద్.
5. సంధ్యాలాల్, భర్త : జితేంద్రలాల్, అమీన్ స్టోర్, సౌత్ అండమాన్, పోర్ట్ బ్లెయిర్.

పై నెంబరు అప్పిలులో 1టు 5 రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించున్నప్పటికి వాటిని మీరు తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిలువరించు చున్నారు. కావున, మీరు **ది.10-09-2025** వ తేదీ, **ఉ.10-30 ని॥లకు** పై కోర్టు వారి సమక్షమున స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గాని, హాజరు అయి, మీకు ఆక్షేపణలు ఏమైనా వున్నచో తెలియపరచుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేదీ: 10-9-2025

దొండపాటి రంగారావు
స్థలం:కొవ్వూరు, డి.డి.వి.కృష్ణారావు
తేది:06-08-2025. అడ్వకేట్స్-కొవ్వూరు